సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



దీపోత్సవానికి వేళాయె

పద్మనాభంలో మంగళవారం సాయంత్రం జరగనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. 8లో



మార్మోగిన శివనామస్మరణ

కార్తీకమాసం చివరి సోమవారం జిల్లాలోని శివాలయాలు కిటకిటలాయి. భక్తులు పరమ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నేడు ఆర్గానిక్ వాక్

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు ఆర్గానిక్ మేళా నిర్వహిస్తున్నారు. 8లో

ముడసర్లోవలో జీవీఎంసీ హెడ్ క్వార్టర్

సాగర్‌నగర్‌లో ఎకోఫ్రెండ్లీ తాబేలు బీచ్

- జీవీఎంసీ కౌన్సిల్‌లో ఆమోదముద్ర
- నష్టపరిహారం చెల్లించిన తర్వాతే 91, 92 వార్డుల్లో రోడ్డు విస్తరించాలి
- సమావేశంలో టీడీపీ కార్పొరేటర్ల రుబాబు



మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: ముడసర్లోవలో 4.37 ఎకరాల్లో జీవీఎంసీ నూతన ప్రధాన కార్యాలయం(హెడ్ క్వార్టర్ బిల్డింగ్) నిర్మాణానికి కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. ఎస్‌ఎంజీ డిజైన్(హైదరాబాద్) కంపెనీ ప్రతిపాదించిన ప్లాన్ అనుసరించి గ్రౌండ్+ 4 అంతస్తు(సుమారుగా 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం)ల్లో నిర్మించేందుకు సభ్యులు ఓకే చెప్పారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జీవీఎంసీ సర్వసభ్య సమావేశం(కౌన్సిల్) సోమవారం జరిగింది. సమావేశంలో 18 అంశాలు, 27 సప్లిమెంటరీ అంశాలతో పాటు 8 టేబుల్ అంశాలు.. మొత్తంగా 53 అంశాలు సభ్యుల ముందుకు చర్చకు వచ్చాయి. ఆరిలోవ, శ్రీహరిపురం ఫస్ట్ రిఫరల్ యూనిట్‌కి సంబంధించిన అంశం వాయిదా పడింది. సాగర్‌నగర్‌లో ఎకో ఫ్రెండ్లీ తాబేలు బీచ్ అభివృద్ధికి సభ్యులు ఆమోదం తెలిపారు. 91, 92 వార్డుల పరిధిలో రోడ్డు విస్తరణకు సంబంధించి ఇళ్లు కోల్పోయే వారికి నష్టపరిహారం అందజేసిన తర్వాతే.. పనులు చేపట్టాలని నిర్ణయించారు.

సాగర్‌నగర్‌లో ఎకోఫ్రెండ్లీ తాబేలు బీచ్

సాగర్‌నగర్‌కు ఎదురుగా తీరంలో రూ.15.65 కోట్లతో 'ఎకోఫ్రెండ్లీ తాబేలు బీచ్' ఏర్పాటుకు సభ్యులు ఆమోదం తెలిపారు. దీనిపై సభ్యుల ప్రశ్నలకు కమిషనర్ వివరణ ఇచ్చారు. అటవీశాఖ సలహాతో పర్యావరణ అనుకూలమైన తాబేలు బీచ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. విశాఖ మహా నగరానికి ఈ బీచ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందన్నారు. బీచ్ టూరిజంను ప్రోత్సహించడానికి, సముద్ర పర్యావరణ జీవితం, ఆలీవ్ రిడ్లే తాబేళ్ల గురించి ఈ బీచ్ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. కాగా.. సీఆర్‌జెడ్ అనుమతులు వస్తేనే ముందుకు వెళ్లాలని సభ్యులు సూచించారు.

రోడ్ల విస్తరణపై సభ్యుల హర్షం

ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశంలో మధ్యాహ్నం 1.30 వరకు జీరో అవర్ కొనసాగింది. వివిధ వార్డులకు సంబంధించిన కార్పొరేటర్లు, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న పలు అంశాలను మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. వార్డుల్లో చురుగ్గా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రోడ్ల విస్తరణపై సంతోషం వెలిబుచ్చారు.

నష్టపరిహారం చెల్లించిన తర్వాతే..

ఎన్‌ఏడీ నుంచి సింహాచలం రోడ్డు వరకు రహదారి విస్తరణపై పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడారు. ఈ రహదారి విస్తరణ.. అభివృద్ధికి దోహదపడనుందని, అయితే లక్ష్మీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో కేవలం 12 అడుగుల రోడ్డు మాత్రమే ఉందన్నారు. ఇళ్లు కోల్పోయే వారితో ముందుగానే చర్చించి, వారికి నష్టపరిహారం అందజేసిన తర్వాతే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. ఇదే విషయంపై కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ఆ ప్రాంతంలో ఉన్న నివాసితుల వద్ద ఎటువంటి డాక్యుమెంట్లు ఉండవని.. అందరికీ నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

కంచరపాలెం– పెందుర్తి రోడ్డు విస్తరించాలి

కంచరపాలెం నుంచి పెందుర్తి వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. గోపాలపట్నం వద్ద రోడ్డు ఇరుకుగా ఉండడంతో రద్దీ ఉంటోందన్నారు. దీని వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు.

నెలాఖరు వరకు చూసి..
వీధి లైట్ల కాంట్రాక్ట్ రద్దు చేస్తాం



కమిషనర్ సాయికాంత్‌వర్మ

పలు వార్డుల్లో వీధి లైట్లు వెలగడం లేదని సభ్యులు జీరో అవర్‌లో అధికారులను ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ నగరంలో 1.18 లక్షల వీధిలైట్లు ఉన్నాయని తెలిపారు. ఆరు నెలలుగా ఈ సమస్య ఉందని, కేవలం 50 వేల లైట్లు 3000 సీసీఎంఎస్ ద్వారా వెలుగుతున్నాయని చెప్పారు. 70 వేల వీధిలైట్లకు సంబంధించి కాంట్రాక్టర్ సీసీఎంఎస్‌లు ఏర్పాటు చేయాల్సి ఉందని, కాంట్రాక్టర్‌కు ఇప్పటికే రెండు నోటీసులు జారీ చేశామన్నారు. ఈ నెలాఖరు వరకు చూసి అప్పటికీ సమస్య పరిష్కరించకపోతే మూడో నోటీసు ఇచ్చి కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. దీనిపై కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మాట్లాడుతూ వీధిలైట్ల విషయమై ప్రతి ఏఈ ఆయా కార్పొరేటర్లను కలిసి సమస్య పరిష్కరించేలా చూడాలన్నారు.



కౌన్సిల్ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

రూ.99.47 కోట్లతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం

ముడసర్లోవలో రూ.99.47 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. ప్రాజెక్ట్‌కి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని మేయర్, కమిషనర్‌ను సభ్యులు కోరారు. దీనిపై కమిషనర్ సాయికాంత్ వర్మ వివరణ ఇచ్చారు. ఎన్‌బీసీ, గ్రీన్ బిల్డింగ్ నిర్మాణపు మార్గదర్శకాలకు అనుగుణంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నిర్మిస్తామని చెప్పారు. కార్పొరేషన్ అనుమతితో ప్రభుత్వ పరిపాలన ఆమోదానికి ఈ అంశం పంపించేందుకు కౌన్సిల్‌లో అజెండాగా చేర్చామన్నారు. ప్రతిపాదిత జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి విశాఖపట్నం ఇండస్ట్రీయల్ వాటర్ సప్లై కంపెనీ(విస్కో) రూ.80 కోట్లు కేటాయిస్తూ.. ఆ సంస్థ బోర్డు సమావేశంలో తీర్మానం చేసిందన్నారు. మిగిలిన బడ్జెట్ రూ.19.47 కోట్లు జీవీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి వినియోగిస్తామని వెల్లడించారు. ఈ అంశాన్ని కౌన్సిల్ ఆమోదించడంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు కమిషనర్ వివరించారు.

హార్టికల్చర్ అధికారుల నియామకానికి ఓకే

జీవీఎంసీ పరిధిలో 110.51 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 34 కిలోమీటర్ల గ్రీన్‌బెల్ట్‌లు, 172 పార్కులు, అభివృద్ధి దశలో ఉన్న 7 థీమ్ పార్కులు, 143 రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు నిర్వహిస్తున్న పార్కులు, 57 ట్రాఫిక్ ఐల్యాండ్స్‌లు ఉన్నాయి. అలాగే 770 పబ్లిక్ ఖాళీ స్థలాలను పార్కులుగా, గ్రీన్‌బెల్ట్ జోన్లుగా అభివృద్ధి చేయనున్నారు. వీటి పర్యవేక్షణకు జోన్‌కి ఓ హార్టికల్చర్ అధికారి చొప్పున 8 మందిని మూడేళ్ల కాలపరిమితికి కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు.

టీడీపీ సభ్యుల రౌడీయిజం



దూసుకొస్తున్న టీడీపీ సభ్యులు

జోన్–4 పరిధి 28వ వార్డు నేవీ హౌస్ నుంచి గ్యాస్ గోడౌన్ మీదుగా నౌరోజీ రోడ్డు వరకు రోడ్డు అభివృద్ధి అంశాన్ని తెలుగుదేశం, జనసేన కార్పొరేటర్లు వ్యతిరేకించారు. రోడ్డు అవసరం దృష్ట్యా మేయర్ ఆమోదం తెలపడంతో పలువురు టీడీపీ, జనసేన కార్పొరేటర్లు.. కార్యదర్శి వద్ద అంశాలు చదువుతున్న ఉద్యోగిపై ఆగ్రహంతో దూసుకుపోయారు. వారిని అడ్డుకునేందుకు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు వెళ్లగా.. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్‌పై టీడీపీ కార్పొరేటర్లు దాడికి పాల్పడ్డారు. దీంతో మేయర్ 10 నిమిషాల పాటు కౌన్సిల్‌ను వాయిదా వేశారు.

ముంపు సమస్య తొలగింది

దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ గతంలో భారీ వర్షం వస్తే పూర్ణామార్కెట్, వెలంపేట, జ్ఞానాపురం, రామకృష్ణా జంక్షన్ తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి మునిగిపోయేవన్నారు. మేయర్ హరి వెంకటకుమారి పర్యవేక్షణలో చేపట్టిన అభివృద్ధి పనులతో మిచాంగ్ తుపాను కారణంగా మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి ముంపు సమస్య రాలేదని.. కాలువల ద్వారా వర్షపు నీరు సజావుగా ప్రవహించిందని సంతోషం వ్యక్తం చేశారు. పాతనగరంలో కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉన్న నేపథ్యంలో నోటీసులు జారీ చేసి వాటిని తొలగించాలని కోరారు. ఈ భవనాల వల్ల అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువయ్యాయని, విష సర్పాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారన్నారు. అందుకే వాటిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

విస్తరణకు రైట్ రైట్

సీతమ్మధార ప్రాంతంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి కైలాసపురం మీదుగా మారియట్ హోటల్ వరకు రోడ్డు విస్తరణకు రంగం సిద్ధమైంది. 8 కిలోమీటర్ల మేర విస్తరణ పనులకు విశాఖ పోర్టు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.34.75 కోట్లు విడుదల చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రహదారి విస్తరణ పనులకు జీవీఎంసీ అధికారులు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నారు.

- సీతమ్మధార అల్లూరి విగ్రహం నుంచి మారియట్ హోటల్ వరకు రోడ్డు విస్తరణ
- 8 కి.మీ. మేర విస్తరణకు రంగం సిద్ధం
- సీఎస్ఆర్ కింద విశాఖ పోర్టు అథారిటీ రూ.34.75 కోట్లు విడుదల

దొండపర్తి: అన్ని రంగాల్లో దూసుకుపోతున్న విశాఖలో పలు బహుళజాతి సంస్థలు, ఐటీ కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్య ప్రజలు విశాఖకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో నగరంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతోంది. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా నక్కవానిపాలెం నుంచి ఎన్‌ఏడీ వరకు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సీతమ్మధార నుంచి కైలాసపురం, మురళీనగర్ ప్రాంతాల మీదుగా మాధవధార హైవే వరకు 60 నుంచి 80 అడుగుల మేర రహదారి విస్తరణకు చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆయా రహదారిలో అనువైన ప్రాంతాల్లో ఇప్పటికే 80 అడుగుల మేర కొత్త రోడ్డు నిర్మించింది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో స్థల సేకరణ చేయాల్సి ఉంది. అలాగే పోర్టు క్వార్టర్స్ మీదుగా ఈ రహదారిని ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు.. పోర్టు అధికారులతో చర్చలు జరిపారు.

సీఎస్ఆర్ కింద రూ.34.75 కోట్లు విడుదల

సీతమ్మధార ప్రాంతంలో అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి కైలాసపురం, ఎన్‌జీజీఓస్ కాలనీ, మురళీనగర్, మాధవధార మీదుగా మారియట్ హోటల్ జాతీయ రహదారి వరకు 8 కిలోమీటర్ల పరిధిలో రోడ్డు విస్తరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో సుమారు మూడు కిలోమీటర్ల మేరకు రోడ్డు పోర్టు పరిధిలో ఉంది. ఈ ప్రాంతాల్లో కొంత మేరకు పోర్టు స్థలాల్లో రహదారిని విస్తరించాల్సి ఉంది. తాజాగా ఈ 8 కిలోమీటర్ల మేరకు విస్తరణ పనులకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.34.75 కోట్లు విడుదల చేసింది.

విస్తరణతోపాటు సుందరంగా రహదారి

రోడ్డు విస్తరణతో పాటు ఈ రహదారిని సుందరంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 8 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డుతో పాటు ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే లైటింగ్, ఆకట్టుకునేలా ప్లాంటేషన్, ఇతర సుందరీకరణ పనులతో దీన్ని ప్రధాన రహదారిగా తీర్చిదిద్దనున్నారు. అలాగే ఉత్తర నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించనున్నారు. త్వరలో ఈ పనుల ప్రారంభానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ రహదారి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే నక్కవానిపాలెం నుంచి మారియట్ హోటల్ వరకు జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలకు తెర పడనుంది.



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను సన్మానిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, ఫ్లోర్‌లీడర్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్లు

జీవీఎంసీ కమిషనర్‌కు సన్మానం

ఉత్తర నియోజకవర్గంలో రోడ్డు విస్తరణతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను విశాఖ ఉత్తర నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజుతో పాటు జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, స్థాయీ సంఘ సభ్యులు, కార్పొరేటర్లు సన్మానించారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో కలిసి శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్థాయీ సంఘ సభ్యులు చల్లా రజిని, కంటి పాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, అక్ల లీలావతి శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, బర్కత్ అలి, కె.వి.ఎన్.శశికళ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఆదేశాలతో..

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి చొరవతో రోడ్డు విస్తరణకు మార్గం సుగమమైంది. ఈ విస్తరణ పనులకు విశాఖ పోర్టు అథారిటీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.34.75 కోట్లు విడుదల చేయడం అభినందనీయం. దీంతో 8 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరించి సుందరంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

– కె.కె.రాజు, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త

నేటి నుంచి 16 వరకు రోజు విడిచి రోజు తాగునీరు

దాబాగార్డెన్స్: ఇటీవల తుపానుకు కాకినాడ జిల్లా కోటనందూరు మండలం, అల్లిపూడి శివారులో ఏలేరు కాలువకు గండి పడిన నేపథ్యంలో మరమ్మతులు చేపట్టేందుకు పలు ప్రాంతాల్లో ఈ నెల 12 నుంచి 16 వరకు రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా జరుగుతుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ రవి తెలిపారు. అత్యవసర ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేయనున్నట్టు చెప్పారు.

జోన్–2 పరిధిలో..

మధురవాడ, పీఎం పాలెం, ఆరిలోవ సెక్టార్స్ 1 నుంచి 12 వార్డుల పరిధిలోని చినగదిలి, పెదగదిలి, విశాలక్షినగర్, రవీంద్రనగర్, బాలాజీ నగర్, ఆదర్శనగర్, ఎస్‌బిజీ నగర్, సుందర నగర్, విశాలాక్షి నగర్, డ్రైవర్స్ కాలనీ.

జోన్–3 పరిధిలో..

12 నుంచి 27 వార్డుల పరిధిలో గల చినవాల్తేరు, పెదవాల్తేరు, పాండురంగాపురం, రేశవనిపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, శివాజీ పాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్, వినాయక నగర్, మంగాపురం కాలనీ, జాలారిపేట, ఆదర్శ నగర్, వాసవానిపాలెం, ఎంవీపీ సెక్టార్స్, సీతంపేట, అక్కయ్యపాలెం, లలితానగర్, ఎన్జీవోస్ కాలనీ, శ్రీనివాసనగర్, నందగిరినగర్, నరసింహనగర్, గణేష్‌నగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాందీనగర్, సింహాద్రిపురం, లక్ష్మీనరసింహనగర్, ఓల్డ్ వెంకోజీపాలెం, దుర్గానగర్ ఏరియా.

జోన్–4 పరిధిలో..

28 నుంచి 39 వార్డుల పరిధిలో వెలంపేట, టౌన్ మెయిన్ రోడ్, రంగిరీజు వీధి డౌన్, మంతవారి వీధి, సున్నపు వీధి, రెల్లి వీధి, జబ్బర్‌తోట, చిలకపేట, అల్లిపురం, నెరెళ్లకోనేరు రోడ్డు, అమ్మవారి వీధి, కుమ్మరి వీధి, కొబ్బరితోట, నేతాజీనగర్, అంబేద్కర్ కాలనీ, జెండాచెట్టు డౌన్, కలెక్టర్ ఆఫీస్ రోడ్, దండు బజార్, దిబ్బలపాలెం, జాలారిపేట, సాలిపేట, కేజీహెచ్ అప్‌గేట్ రోడ్డు, డాబాగార్డెన్స్ ప్రధాన రహదారి, జగదాంబ జంక్షన్ రోడ్, నీలమ్మ వీధి ప్రాంతం.

జోన్–5 పరిధిలో..

5వ జోన్ పరిధి 41 నుంచి 57 వార్డుల పరిధిలో గల రైల్వే న్యూకాలనీ, వెంకటేశ్వర కాలనీ, జ్ఞానాపురం, బాబూకాలనీ, శిలువ వీధి, సెబాస్టియన్ కాలనీ, బాబూకాలనీ, సుబ్బలక్ష్మినగర్, తాటిచెట్లపాలెం, చాకలిపేట, టీఎస్ఎన్ కాలనీ, మర్రిపాలెం, జ్యోతి నగర్, మహారాణి వీధి, బాపూజీ నగర్, మాధవధార వుడా లేఅవుట్, మాధవధార, కళింగనగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, పట్టాభిరెడ్డి తోట, సూర్యనగర్, సిద్ధార్థ నగర్, తుమ్మడిపాలెం, సుభాష్‌నగర్, భవాని గార్డెన్, కస్తూరినగర్–1, శాంతినగర్–1,2, సంజీవయ్యనగర్ హిల్ ఏరియా, బాపూజీ నగర్–1,2, అంబేడ్కర్ ఎస్టేట్, సురేష్ రామ్‌నగర్, పెద్దకొత్తూరు హిల్ ఏరియా, డౌన్ ఏరియా, రాంజీ ఎస్టేట్ డౌన్ ఏరియా, తిక్కవానిపాలెం కాలనీ, జయప్రకాష్ నగర్, కప్పరాడ–1, 2, ఇందిరానగర్–4, 5, మహాత్మాగాంధీ నగర్, జవహర్‌లాల్ నగర్, ఎ.ఎస్.ఆర్.నగర్, శ్రీనివాస నగర్, పోలీస్ క్వార్టర్స్, గోకుల్ నగర్, గొల్ల కంచరపాలెం, దుర్గానగర్, అబిద్ నగర్, పోస్ట్ ఆఫీస్ ఏరియా, గోలీలపాలెం, శ్రీనివాస నగర్, నందగిరి నగర్, చెక్కుడు రాయ బిల్డింగ్ ఏరియా, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం ఏరియాలు.

జోన్–8 పరిధిలో..

శ్రీరామనగర్, శ్రీనుబాబునగర్, అజంత పార్క్, టైలర్స్ కాలనీ, ఉడా కాలనీ, పవర్ ఆఫీస్ ఎదురుగా, ఆర్.ఆర్.వి. పురం రజక కాలనీ

13న డీ ఫార్మసీ స్పాట్ ప్రవేశాలు

మురళీనగర్: నగరంలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో డీ-ఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు ఈనెల 13న నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ కోర్సులు చేసిన విద్యార్థులు ఈనెల 12వ తేదీలోగా నేరుగా కాలేజీ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాస్‌పోర్టుసైజు ఫొటో, పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమో, కులధృవీకరణ పత్రం, టీసీ సమర్పించాల్సి ఉంటుంది.

అనంతుని దీపోత్సవానికి వేళాయె


పూల మాలలతో అలంకరించిన ఆలయం

పద్మనాభం: పద్మనాభంలో మంగళవారం సాయంత్రం జరగనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. గిరిపైన అనంతుని ఆలయాన్ని, గిరి దిగువన ఉన్న కుంతీ మాధవస్వామి ఆలయాన్ని పూలతో అందంగా అలంకరించారు. దీపోత్సవానికి అవసరమయ్యే 14 డబ్బాల నూనె, ఐదు వేల ఒత్తులు, ఐదు వేల ప్రమిదలు సిద్ధం చేశారు. కుంతీ మాధవస్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను మధ్యాహ్నం 3 గంటలకు గరుడ వాహనంపై తీసుకు వచ్చి ప్రథమ పావంచా వద్ద కొలువుదీర్చుతారు. గిరి దిగువన కుంతీ మాధవస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీని నిలువరించడానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు. గిరిపై జే గంట మోగించగానే 5.30 గంటలకు అనంత పద్మనాభస్వామి మెట్లకు కిరు వైపులా భక్తులు ఒక్కసారిగా దీపాలు వెలిగిస్తారు. దీపోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. వీరిలో ముగ్గురు ఏసీపీలు, మహిళా కానిస్టేబుళ్లు 70 మంది ఉన్నారు.

బస్సుల దారి మళ్లింపు

పద్మనాభం మీదుగా సింహాచలం నుంచి విజయనగరం వెళ్లాల్సిన బస్సులను, విజయనగరం నుంచి సింహాచలం వెళ్లాల్సిన బస్సులను మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత తగరపువలస, ఆనందపురం మీదుగా మళ్లిస్తారు. విజయనగరం నుంచి ప్రత్యేకంగా దీపోత్సవానికి వేసే షటల్ సర్వీసు బస్సులను అర్చకునిపాలెం నుంచి, సింహాచలం నుంచి వేసే షటల్ సర్వీసు బస్సులను పెట్రోల్ బంకు నుంచి వెనక్కి మళ్లిస్తారు.

పార్కింగ్ ఎక్కడంటే?

తగరపువలస నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, కారులకు స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల వద్ద, విజయనగరం నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, కారులకు అర్చకునిపాలెం రెండో విజయరామరాజు జూనియర్ కళాశాల వద్ద , సింహాచలం నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, కారులను పద్మనాభం గోస్తని వంతెన కింద పార్కింగ్ ఏర్పాటు చేశారు.

యువ న్యాయవాదులకు 'నేస్తం'

- పండగలా వైఎస్సార్ లా నేస్తం
- జిల్లాలో 166 మందికి రూ.49.80 లక్షల జమ
- గతేడాది లబ్ధిపొందిన 119 మంది న్యాయవాదులు


యువ న్యాయవాదులకు చెక్ అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, డీఎల్‌డీవో పూర్ణిమాదేవి,అధికారులు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ లా నేస్తం పథకం జూనియర్ లాయర్లకు ప్రాక్టీస్ సమయంలో ఆర్థిక తోడ్పాటును అందిస్తోంది. వృత్తిలో స్థిరపడేంత వరకు వారి బాగోగుల్ని ప్రభుత్వమే చూసుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ లా నేస్తం పథకంలో భాగంగా జిల్లా నుంచి 166 మంది యువ న్యాయవాదులు ఈ ఏడాది లబ్ధిపొందారు. నాలుగో ఏట రెండో విడత లా నేస్తం నిధులను సీఎం వైఎస్ జగన్ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి సోమవారం విడుదల చేశారు. విశాఖ నుంచి సీఎం కార్యక్రమంలో కలెక్టర్ డా.మల్లికార్జున వర్చువల్‌గా పాల్గొన్నారు.

అనంతరం జిల్లాలో లా నేస్తం లబ్ధిదారులు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున 166 మందికి రూ.49.80 లక్షలు వారి ఖాతాల్లో జమ చేశారు. గత ఏడాది జూలై నుంచి ఈ ఏడాది జూన్ వరకు రెండు విడతల్లో రెండు దఫాలు 119 మంది లబ్ధి పొందగా నాలుగో ఏట రెండో విడతలో తాజాగా 166 మంది ఆర్థిక ప్రయోజనం పొందారు. సీఎం ప్రసంగం అనంతరం జిల్లాలోని అర్హులైన యువ న్యాయవాదులకు మెగా చెక్కును కలెక్టర్, సచివాలయాల జిల్లా కోర్డినేటర్ పూర్ణిమా దేవి, జీవీఎంసీ యుసీడీ పాపినాయుడు, ఇతర అధికారుల చేతుల మీదుగా అందజేశారు.

వృత్తికి ఆర్థిక భరోసా



మేము మురళీనగర్‌లో ఉంటున్నాం. చిన్నప్పటి నుంచి నాకు న్యాయవాద వృత్తి అంటే చాలా ఇష్టం. మా తల్లిదండ్రులు ఆ దిశగానే ప్రోత్సహించారు. ఇటీవల జిల్లా కోర్టులో యువ న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించాను. అయితే కొన్ని సందర్భాల్లో ఆర్థికంగా కొంత ఇబ్బంది పడ్డాను. ఈ క్రమంలో వైఎస్సార్ లా నేస్తం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే ఎంపిక చేశారు. ఈ రోజు లా నేస్తం ద్వారా వృత్తికి ఆర్థిక భరోసా లభిస్తోంది. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– బీవీఎస్ఎస్ లాస్య ప్రియ, జూనియర్ లాయర్

సీఎం జగన్ పేదలకు చేయూత ఇస్తున్నారు



పేదలకు సేవచేస్తూ, వారిని ఆర్థికంగా, సామాజికంగా ఆదుకోవడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. చాలా మందికి ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయి. నేను కూడా ఈ రోజు లా నేస్తం పథకం కింది ఆర్థిక లబ్ధి పొందాను. దీని ద్వారా ప్రాక్టీస్‌ని ప్రశాంతంగా చేయగలుగుతున్నాను. లా నేస్తం డబ్బులతో ప్రాక్టీస్‌కు అవసరమైన పుస్తకాలు కొనుక్కుంటున్నాను.

– పి.స్వర్ణ, యువ న్యాయవాది, జిల్లా కోర్టు

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేసే అర్జీదారుడు.. పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా అతని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారుడికి ఇచ్చే సమాధానం పూర్తి వివరాలతో ఉండాలన్నారు. అనంతరం వివిధ శాఖల్లో పెండింగ్ అర్జీలపై ఆరా తీసిన జేసీ.. ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో భాగంగా జేసీ మొత్తం 257 అర్జీలను స్వీకరించగా.. వాటిలో 95 అర్జీలు రెవెన్యూ శాఖ, 25 పోలీసు శాఖ, 71 జీవీఎంసీ, 66 అర్జీలు ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. ఏసీపీ బాపూజీ, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో డి. హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ, ఇతర శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్‌కు స్పందనకు 59 ఫిర్యాదులు

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని డీసీపీ బి.లక్ష్మీనారాయణ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 59 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ స్వయంగా ఫిర్యాదారుల సమస్యలు తెలుసుకొని వాటిని సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వీటిని వెంటనే పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏసీపీలు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

విమ్స్‌లో వైద్య పోస్టుల భర్తీకి 15న ఇంటర్వ్యూ

ఆరిలోవ: విమ్స్‌లో 26 వైద్య పోస్టుల భర్తీకి ఈ నెల 15న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఎలాంటి రాత పరీక్ష లేకుండా ఉత్తీర్ణత శాతం, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి పోస్టులు భర్తీ చేస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి హనుమంతవాక వద్ద గల విమ్స్‌లో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూకు ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

ఖాళీలు ఇలా : విమ్స్‌లో 26 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. అనస్థీషియా విభాగంలో 6 పోస్టులు, న్యూరోసర్జరీ 2, న్యూరాలజీ 2, కార్డియాలజీ 2, సర్జికల్ అంకాలజీ 2, ఎమర్జెన్సీ మెడిసిన్ 2, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్(మెడికల్)లో 2 పోస్టులతో పాటు సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, మెడికల్ అంకాలజీ, ఎండోక్రైనాలజీ, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, పల్మనాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్(పాథాలజీ) విభాగంలో చెరో పోస్టును భర్తీ చేయనున్నట్లు చెప్పారు. స్పెషాలిటీ వైద్యులకు నెలకు రూ.92 వేలు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు నెలకు రూ.1.60 లక్షల వేతనం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

యాసిడ్ బాధితురాలికి అండగా ఉంటాం

రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ


బాధితురాలిని పరామర్శిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ

మహారాణిపేట: యాసిడ్ దాడికి గురైన బాధితురాలికి అండగా ఉంటామని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ హామీ ఇచ్చారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆమెను సోమవారం ఉమ పరామర్శించారు. పెందుర్తి నియోజకవర్గం చింతగట్ల పంచాయతీ నందవరపువానిపాలెంలో ఒంటరిగా నివసిస్తున్న మహిళపై తెలుగుదేశం పార్టీ పంచాయతీ అధ్యక్షుడు చీపురపల్లి నరసింగరావు యాసిడ్‌తో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా.. బాధితురాలిని కేజీహెచ్‌లో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యురాలు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పెందుర్తిలో చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. మహిళపై యాసిడ్ దాడి చేసి.. ఆమెను బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు, బంగారం దొంగతనం చేసిన తన అనుచరుడి పట్ల మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఉదార స్వభావంతో వ్యవహరించడం దారుణమన్నారు. బంగారం, డబ్బును పోలీసులు రికవరీ చేసి.. నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. కాగా.. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బాధితురాలితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి, సీడీపీవో నీలవేణి, వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్గానిక్ వాక్

మద్దిలపాలెం: ఆర్గానిక్ మేళాను ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నామని, దీనిపై అవగాహన కల్పించేందుకు 'ఆర్గానిక్ నడక'ను మంగళవారం బీచ్‌రోడ్డులో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయకులు జలగం కుమార్‌స్వామి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు జరగనున్న ఆరోగ్య నడకను జయప్రదం చేయాలన్నారు. ప్రకృతి ఆధారిత పంటలను ఆదరించే వారంతా తప్పకుండా పాల్గోనాలన్నారు. కార్యక్రమంలో ఆర్గానిక్ ప్రతినిధులు ఉషా గజపతిరాజు, గ్రీన్ క్లైమెట్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, మేళా ప్రతినిధులు సాయిబాబు పాల్గొన్నారు.

సీఐఐ యంగ్ ఇండియన్స్ చైర్మన్‌గా హర్షనందన్



హర్షనందన్, శ్రావణి

బీచ్‌రోడ్డు: సీఐఐ యంగ్ ఇండియన్స్ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్‌గా హర్ష నందన్, కో చైర్‌పర్సన్‌గా శ్రావణి సంధ్య ఎంపికయ్యారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం చాప్టర్ 15వ వార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐఐ విశాఖపట్నం చైర్మన్ డాక్టర్ పీపీ లాల్ కృష్ణ వీరు ఎంపికైనట్లు ప్రకటించారు. హర్షనందన్ వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్ డైరెక్టర్‌గా ఉన్నారు. శ్రావణి ఔరా స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ వ్యవస్థాపకురాలు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

'బంగారు' బాలలు

స్కేటింగ్‌లో విశాఖ క్రీడాకారులను పతకాల పంట


ట్రోఫీతో విశాఖ స్కేటింగ్ క్రీడాకారులు

మురళీనగర్ : మురళీనగర్ స్కేటింగ్ పార్కులో రోల్ బాల్, స్పీడ్ స్కేటింగ్ క్రీడల్లో తర్ఫీదు పొందిన బాలలు రాష్ట్ర స్థాయి స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఏపీ స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో విశాఖ నుంచి పాల్గొన్న బాలబాలికలు తమ సత్తా చాటారు. కోచ్ పూసర్ల సంతోష్ కుమార్ వద్ద తర్ఫీదు పొందిన వీరు అండర్–4 నుంచి 16 ఏళ్లు దాటిన విభాగాల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 200 మీ., 400మీ., 1000 మీటర్లు, రోడ్ రేస్ పోటీల్లో తమ సత్తా చాటి 53 బంగారు పతకాలు, 41 రజత, 19 కాంస్య పతకాలను సాధించారు. ఓవరాల్ చాంపియన్‌గా నిలిచి కప్‌ను సొంతం చేసుకున్నారు. సోమవారం వీరు మురళీనగర్ చేరుకుని వైశాఖి స్పోర్ట్స్ పార్కు లోని స్కేటింగ్ రింకు వద్ద సమావేశమయ్యారు. వీరిని స్పీడ్ స్కేటింగ్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మురుగానంద్, టెక్నికల్ హెడ్ గౌతమ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్‌రెడ్డి అభినందించారు.

డబ్బా పేలి ముగ్గురికి గాయాలు

అక్కిరెడ్డిపాలెం: స్క్రాప్ దుకాణంలో వాహనం నుంచి ఇనుప డబ్బాలు దించుతుండగా.. ఒక డబ్బా పేలి దుకాణంలో పనిచేసే ముగ్గురు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. గాజువాక వై జంక్షన్ వద్ద ఒక స్క్రాప్ దుకాణంలో సత్యవతి, రాజీ, గంగాధర్ పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి ఒక వాహనం నుంచి ఇనుప డబ్బాల లోడ్ వచ్చింది. వాహనంలోని డబ్బాలను ఈ ముగ్గురు దించుతుండగా ఒక డబ్బా పేలిపోయింది. దీంతో గంగాధర్, సత్యవతి, రాజీలకు గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన గంగాధర్‌ను కేజీహెచ్‌కు తరలించారు. సత్యవతి, రాజీని గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ డివిజన్ కమిటీ సభ్యుడిగా జీవన్ కుమార్



విశాఖ విద్య: ఎస్సీ, ఎస్టీ విశాఖపట్నం డివిజన్ కమిటీ సభ్యుడిగా చెవ్వేటి జీవన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయవాదిగా సామాజిక సేవలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని జీవన్ కుమార్ తెలిపారు.

16 ఆటోలు, ఒక బస్‌పై కేసు నమోదు


వివరాలు సేకరిస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: రవాణా శాఖ అధికారులు సోమవారం పీఎంపాలెం, మధురవాడ, హనుమంతవాక ప్రాంతాల్లో స్కూల్ ఆటోలు, బస్సులను తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 16 ఆటోలు, ఒక స్కూల్ బస్‌పై కేసులు నమోదు చేశారు. మరో ఆటోను సీజ్ చేశారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు, విద్యార్థులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఉపరవాణా కమిషనర్ రాజారత్నం హెచ్చరించారు. తనిఖీల్లో అధికారులు బి.బాలాజీరావు, రాజారావు, శిరీషాదేవి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలు


వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలుపై సమీక్షిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: జిల్లాలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పక్కాగా అమలు కావాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలుపై జిల్లా స్థాయి పర్యవేక్షణ, సమీక్ష కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తుందో.. చిత్తశుద్ధితో ఆ లక్ష్యాలను అధిగమించాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలకు అందించే నిత్యావసర వస్తువుల పంపిణీలో ఆటంకాలు ఉండకూడదన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, తగిన చర్యలు చేపట్టాలన్నారు. తదుపరి సమావేశం నాటికి సాధించిన లక్ష్యాలు, లేకపోతే అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. నాడు–నేడు పనుల పురోగతిని సమీక్షించిన జేసీ.. రెండు వారాల్లో పెండింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలను ఫేషియల్ రికగ్నేషన్ ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో నమోదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి డి.వెంకటేశ్వరి, సీడీపీవోలు ఎం.వి.రమణ కుమారి, డి.నీలవేణి, ఎం.శ్రీదేవి, ఏసీడీపీవో జి.శ్రీలత, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మురికివాడల్లో ఒడిశా కార్పొరేషన్ల బృందం పర్యటన


స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న బృంద ప్రతినిధి శశిర్ రంజన్‌దాస్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధి పలు మురికివాడ ప్రాంతాల్లో ఒడిశాలోని భువనేశ్వర్, ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల బృందం సోమవారం పర్యటించింది. జోన్–3, 4 పరిధిలో గల అచ్చయ్యమ్మపేట, కొబ్బరితోట, విద్యానగర్ తదితర మురికివాడ ప్రాంతాలు సందర్శించిన ఆ బృందం అక్కడ నివసిస్తున్న ప్రజలకు జీవీఎంసీ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, పథకాలను తెలుసుకుంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో టాటా స్టీల్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో జాగా మెషిన్ పేరిట ఒడిశాలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆ బృందం ప్రతినిధి శశిర్ రంజన్‌దాస్ వివరించారు. మురికివాడల్లో నివసిస్తున్న ప్రజలకు కల్పిస్తున్న విద్యుత్, నీటి సరఫరా, మరుగుదొడ్లు, వీధిలైట్లు, రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాల్స్, ఓపెన్ ప్లేస్ డెవలప్‌మెంట్, చిల్డ్రన్ పార్క్ తదితర తొమ్మిది రకాల సౌకర్యాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న పథకాలు, మౌలిక సదుపాయాలు, జీవీఎంసీ ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కొనియాడారు.

IN THE HONOURABLE COURT OF THE VTH ADDL. JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S. 1572/2021

Between :
ICICI Bank Ltd., ...Plaintiff
And
Sri Shiva Prasad Sunkara ...Defendant

SUMMONS TO DEFENDANT

To,
Shiva Prasad Sunkara
S/o. Sri Naga Muni Sunkara,
Door No. 31-56-2/60, 4F 504,
Srinivasa Habital, Siman Nagar,
Kurmannapalem, Gajuwaka,
Visakhapatnam- 530046

Please take notice that the plaintiff herein filed above suit for Directing the defendants to pay an aggregate sum of Rs. 5,47,467.00/- (Rupees Five Lakhs Fourty Seven Thousand Four Hundred Sixty Seven Only) and for costs and other relief's, the same is posted for your appearance in the above named court on 09-01-2024 at 10:30 A.M. in person or through a Pleader duly instructed to answer the questions relating to the above proceedings and in default of your appearance on the aforesaid day, the case will be will be determined in your absence.

// BY ORDER OF THE HONOURABLE COURT //
SMT. B. ANANTHA LAKSHMI
ADVOCATE
Visakhapatnam
Date: 30-11-2023

16న జిల్లా క్రాస్ కంట్రీ జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్ : జిల్లా క్రాస్ కంట్రీ జట్ల ఎంపిక ఈనెల 16న రైల్వే గ్రౌండ్స్‌లో జరగనుంది. విశాఖ అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో అండర్–16, 18, 20 మెన్, వుమెన్ జట్లను ఎంపిక చేయనున్నారు. మెన్, వుమెన్‌కు 10 కిలోమీటర్లు, అండర్ 20 బాలురకు ఎనిమిది కిలో మీటర్లు మేర పోటీ అనంతరం జట్టుకు ఎంపిక చేయనున్నారు. అండర్–20 బాలికలకు, అండర్–18 బాలురకు ఆరు కిలోమీటర్లు, అండర్–18 బాలికలకు నాలుగు కిలోమీటర్లు, అండర్–16 బాలబాలికలకు రెండు కిలో మీటర్ల మేర నిర్వహించిన పోటీ అనంతరం జట్ల ఎంపిక చేయనున్నారు.

జూనియర్స్ వంద, సీనియర్స్ రెండు వందల రూపాయలను పోటీల రుసుంగా చెల్లించాలని, జనన ధ్రువీకరణతో పోటీలకు హాజరుకావల్సి ఉందని సంఘం కార్యదర్శి నారాయణరావు తెలిపారు. ఎంపిక చేసిన జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలు కాకినాడ జిల్లా సామర్లకోటలో ఈనెల 24వ తేదీన జరగనున్నాయి.